
సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

గవర్నర్ అధ్యక్షతన 'స్పిక్ మాకే' సలహామండలి సమావేశం

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్పిక్ మాకే (సొసైటీ ఫర్ ది ప్రమోషన్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చర్ యమాంగెస్ట్ యూత్) 10వ అంతర్జాతీయ సదస్సు నిమిత్తం.. సలహామండలి సమావేశం శనివారం రాజ్‌భవన్‌లో నిర్వహించారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సలహామండలి సభ్యులతో పాటు కళలు, సంస్కృతులు, విద్య, పరిపాలన రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.


సేవా కార్యక్రమాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, తదితరులు

మాది పీపుల్స్ ఫ్రెండ్లీ ప్రభుత్వం: డిప్యూటీ సీఎం భట్టి

రాజేంద్రనగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరాభివృద్ధికి పదివేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించామని, రాష్ట్రంలో క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి కొత్త విద్యుత్ పాలసీని రాష్ట్ర ప్రభుత్వం త్వరలో తీసుకురాబోతుందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మాది పీపుల్స్ ఫ్రెండ్లీ ప్రభుత్వమని గుర్తు చేశారు. శనివారం నగర శివారులోని గగన్‌పహడ్‌లోని సిటాడెల్ కన్వెన్షన్‌లో జరిగిన 30వ అంతర్జాతీయ సదస్సుకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మహవీర్ సేవ కార్యక్రమాలను పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. సామాజిక పరివర్తన కోసం ఎటువంటి లాభాపేక్ష లేకుండా మహవీర్ జైన్ సంస్థ పనిచేయడం అభినందనీయమన్నారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం కూడా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రతి సంవత్సరం రూ.20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందిస్తున్నామన్నారు. ఉచితంగా నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ఏడాదికి రూ. 5వేల కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. ఢిల్లీలో విపరీతమైన కాలుష్యం నేపథ్యంలో.. ఆ ఇబ్బందులు నగరంలో తలెత్తకుండ క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇందులో బాగంగా కాలుష్య కారకమైన పరిశ్రమలను హైదరాబాద్ నగరం నుంచి ఔటర్ రింగు రోడ్డు బయటకు తరలిస్తున్నామని తెలిపారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

కొత్త ఏడాదిలో ఉత్సాహంగా విధులు నిర్వహించాలి

- సీపీ అవినాష్ మహంతి

హైదరాబాద్ సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కొత్త ఏడాదిలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది రెట్టించిన ఉత్సాహంతో సమర్థవంతంగా విధులు నిర్వహించి పనిచేయాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి సూచించారు. గచ్చిబౌలి కమిషనరేట్‌లో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొని అధికారులు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. కొత్త ఏడాదిలో నిర్ణయించుకున్న లక్ష్యాలను సాధించేందుకు అందరూ కలిసి పనిచేయాలన్నారు. జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయల్ డేవిస్ మాట్లాడుతూ ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ఐటీ కారిడార్‌లో పరిమిత సిబ్బందితో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నామని, రోడ్ల విస్తరణతో రవాణా వ్యవస్థ కొంత మెరుగుపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల డీసీపీలు తమ పరిధిలో చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో కమిషనరేట్ పరిధిలోని డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్‌లు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలపై సర్కార్ సానుకూలం


- మీడియా అకాడమి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి4 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జవహర్‌లాల్‌నెహ్రూ హౌజింగ్ సొసైటీ జర్నలిస్టుల స్థలాల కేటాయింపులపై సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలపై ఉన్నతస్థాయిలో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాల కేటాయింపులో ఎలాంటి విధానాన్ని అనుసరించాలో చర్చలు జరుపుతున్నట్టు పేర్కొన్నారు. త్వరలో ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం వెలువడుతుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు అనే వ్యత్యాసం లేకుండా అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ జారీ చేయాలని ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్టు తెలిపారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరహత్‌అలీ, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రాములు, తెలంగాణ వీడియో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి హరీష్, యాదగిరి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.


నందగిరిహిల్స్ పార్కు విషయంపై ఇరుపక్షాలతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

నందగిరి హిల్స్ పార్కు గురించి సమావేశం

బంజారాహిల్స్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నందగిరిహిల్స్ బస్తీలోని హౌజింగ్ పార్కు విషయం గురించి హైడ్రా కమిషనర్ సమావేశం నిర్వహించారు. శనివారం గురుబ్రహ్మనగర్ బుద్ధభవన్ హాల్‌లో పార్టీ నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మామిడి నర్సింగరావు, బస్తీ కమిటీ సభ్యులు గోపాల్‌నాయక్, రాంచందర్, రవినాయక్, మోహన్‌నాయక్, నందగిరి సొసైటీ సభ్యులు బసవరాజ్, ఎంఎం రెడ్డి పాల్గొని అభిప్రాయాలను తెలిపారు. ఇరుపక్షాల అభిప్రాయాలు తెలుసుకుని, వారి నుంచి ధ్రువపత్రాలు తీసుకున్న అనంతరం హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇక్కడ ఉన్న 2 ఎకరాల స్థలంలోని 272 ఇళ్లు, ఫెన్సింగ్ పార్కు ప్రాంతాలు కాపాడేందుకు నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపుతానని హామీ ఇచ్చారు.


కేసీఆర్‌తో బీఆర్ఎస్ నాయకులు

అందరికీ అమ్మ పుస్తకాన్ని ఆవిష్కరించిన కేసీఆర్

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ తెలంగాణ తల్లిపై రాసిన 'అందరికీ అమ్మ పుస్తకాన్ని' బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆవిష్కరించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పలువురు బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు శనివారం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు తాతామధు, ఎంసీ కోటిరెడ్డితో పాటు పలువురు జడ్పీ చైర్మన్లు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్


విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేస్తున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, కార్పొరేటర్ జి.రచనశ్రీ, కన్వీనర్ ఎం.రమేష్‌రాం తదితరులు

కవాడిగూడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు దేశాభివృద్ధి కోసం కష్టపడుతూ.. మహనీయులను ఆదర్శంగాతీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ పిలుపునిచ్చారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల పట్ల చిన్నచూపు చూడకుండా పాఠశాలలకు విద్యార్థులను పంపించాలని ఆయన సూచించారు. శనివారం కవాడిగూడ డివిజన్ తాళ్లబస్తీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సోషల్ వర్కర్ సురేష్, నవీన ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులను డాక్టర్ కె.లక్ష్మణ్, కార్పొరేటర్ జి.రచనశ్రీతో కలిసి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలు కల్పించడానికి దాతలు ముందుకు రావాలని ఆయనకోరారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న నాటి నుంచి కవాడిగూడ ప్రభుత్వ పాఠశాలలో అనేక మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషిచేశానన్నారు. భవిష్యత్‌లో కూడా పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందించేందుకు ఆయన కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదవిన సైంటిస్ట్, మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్‌కలాంను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. చిత్రాల నర్సింహలు ప్రభుత్వ పాఠశాలకు స్థలం డొనేట్ చేయడంతోపాటు ఆ పాఠశాలలోని విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు పంపిణీ చేయడానికి వచ్చిన ఆయన కుటుంబసభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకర్గ కన్వీనర్ ఎం.రమేష్‌రాం, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, పరిమళ్‌కుమార్, రంగరాజ్‌గౌడ్, పూసరాజు, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎంసీ మహేందర్ బాబు, ఎ.ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు, బీజేపీ నాయకులు రాగం రవికుమార్, రమేష్‌గౌడ్, సలంద్రి దిలీప్ యాదవ్, అనిల్‌కుమార్, కవాడిగూడ హైస్కూల్ ప్రిన్సిపాల్ మీనాకుమారి, ప్రాథమిక పాఠశాల ప్రిన్సిపాల్ పావని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే మహిళా ఉపాధ్యాయులందిరినీ సావిత్రిబాయిపూలే జయంతిని పురస్కరించుకొని వారికి శాలువాలు కప్పి డాక్టర్ కె.లక్ష్మణ్, కార్పొరేటర్ జి.రచనశ్రీ, బీజేపీ నేతలు ఘనంగా సన్మానించారు.

21వ శతాబ్దం డిజిటల్ టెక్నాలజీదే

- స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుతో ఉన్నతమైన ఉద్యోగావకాశాలు
- అన్ని యూనివర్సిటీల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు
- తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి


డీజీటల్ టెక్నాలజీపై నిర్వహించిన జాతీయ సదస్సులో ప్రసంగిస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి

బర్కత్‌పుర, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ టెక్నాలజీకి 21వ శతాబ్దం కేంద్ర బిందువుగా మారనున్నదని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి అన్నారు. ఒక్కొక్క శతాబ్దం ఒక్కొక్క రంగానికి మూలబిందువుగా కొనసాగిందని, ఈ శతాబ్దిలో డిజిటల్ టెక్నాలజీ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. శనివారం అవంతి గ్రూప్ ఆఫ్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో కాచిగూడ మున్నూరుకాపు భవన్‌లో ప్రజ్ఞా - 2కే 25 పేరుతో డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ స్కిల్ యూనివర్సిటీ ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని, రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి, అవంతి విద్యా సంస్థల చైర్మన్ ఎం.శ్రీనివాస్‌రావు, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ మాజీ డీన్ ఎం.రామ్మోహన్ రావు, ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ ప్రొ.ఎస్.శ్రీనివాసమూర్తి, బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధి బీకే.వసంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


కవిత నిర్వహించిన సభాప్రాంగణాన్ని పాలతో శుద్ధిచేస్తున్న మాజీ చైర్మన్, కాంగ్రెస్ నేత డాక్టర్ పిడమర్తి రవి, నాయకులు

కవిత బీసీ మహాసభతో ధర్నాచౌక్, బీసీ వాదం అపవిత్రం

కవాడిగూడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బీసీ మహాసభ నిర్వహించడంతో ఇందిరాపార్కుధర్నాచౌక్, బీసీవాదం అపవిత్రమైందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో కవిత నిర్వహించిన బీసీ మహసభ స్థలాన్ని డాక్టర్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నేతలు పాలతో శుద్ధి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు చంద్రశేఖర్, ఎండీ రహీం, నందు నర్సింహ, సురేష్, శ్రీకరణ్, దర్శనం జాన్, త్రినాథ్, నరేష్, గణేశ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎంపీ వి.హనుమంతరావు

శ్రీరమణ చౌరస్తా వద్ద అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు

బర్కత్‌పుర, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తా వద్ద 13 ఫీట్ల డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ ఎంపీ వి.హనుమంతరావు వెల్లడించారు. ఫ్లైఓవర్ కింద ప్రస్తుతం అంబేడ్కర్ విగ్రహం పక్కన ఈ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శనివారం అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ మారుతిదివాకర్‌తో కలిసి విగ్రహ ఏర్పాటు స్థలాన్ని వీహెచ్ పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, బీ బ్లాక్ అధ్యక్షుడు కుంకుమ రాజేశ్వర్‌రావు, యూత్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి కోటం అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'నామినేటెడ్'లో కురుమలకు ప్రాధాన్యం ఇవ్వాలి

బర్కత్‌పుర, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో వెనుకబడిన కురుమ జాతికి రెండు రాష్ట్ర ప్రభుత్వాలు నామినేటెడ్ పోస్టులలో ప్రాధాన్యత ఇవ్వాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో ఏపీ కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జె.శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఈనెల 23న మదనపల్లిలో కురుమల ఏపీ, తెలంగాణ రాష్ట్ర మహాసభ నిర్వహిస్తున్నామన్నారు. నీల వెంకటేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

'నిరుపేద బ్రాహ్మణ కుటుంబాన్ని ఆదుకోండి'

నల్లకుంట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మూడురోజుల క్రితం మృతిచెందిన నిరుపేద బ్రాహ్మణుడు కొవ్వూరి కిషన్‌రావు(70) కుటుంబాన్ని మానవతావాదులు ఆదుకోవాలని బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు తెలిపారు. శనివారం నల్లకుంటలోని సమితి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దశదిన కర్మ వరకు మరో వారం రోజులపాటు నిర్వహించాల్సిన కార్యక్రమాలకు ఆర్థిక స్థోమత లేదన్నారు. కిషన్‌రావు సతీమణి ప్రమీళకు ఆర్థిక సహాయం అందించే వారు 9346706613లో సంప్రదించాలని కోరారు.

జర్నలిస్టు భీమ్‌రావుయాదవ్ హఠాన్మరణం

నివాళులర్పించిన టీడబ్ల్యూజేఎఫ్, టీజేఎస్, సీనియర్ జర్నలిస్టులు


భీమ్‌రావుయాదవ్ (ఫైల్)


భీమ్‌రావుయాదవ్ భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న మామిడి సోమయ్య, సీనియర్ జర్నలిస్టులు

నల్లకుంట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్టు ఎన్.సి.భీమ్‌రావు యాదవ్(60) శనివారం తెల్లవారుజామున మౌలాలిలోని ఆయన నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. హైదరాబాద్‌లోని ముషీరాబాద్ కేంద్రంగా ఆయన వివిధ పత్రికల్లో దాదాపు మూడు దశాబ్దాల పాటు విలేకరిగా పనిచేశారు. ఆంధ్రజ్యోతి, ఈనాడు పత్రికల్లో చాలాకాలం పనిచేసిన ఆయన స్థానిక ప్రజాసమస్యల పరిష్కారం కోసం కృషి చేశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బీమ్‌రావు భౌతికకాయానికి సాయంత్రం మౌలాలిలో అంత్యక్రియలు జరిగాయి. భీమ్‌రావుయాదవ్ మరణవార్త తెలియగానే తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, గ్రేటర్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్, ముషీరాబాద్ జర్నలిస్ట్ అసోసియేషన్ నాయకులు సీహెచ్.వీరారెడ్డి, పలువురు జర్నలిస్టులు ఆయన భౌతికకాయంపై పూలమాలలేసి శ్రద్ధాంజలి ఘటించారు. భీమ్‌రావుయాదవ్ మృతిపట్ల హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ తీవ్రసంతాపం వ్యక్తంచేశారు.


యామినికి పురస్కారం ప్రదానం చేస్తున్న జస్టిస్ శేషశయనారెడ్డి తదితరులు

'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' న్యూస్ ప్రజెంటర్‌కు పురస్కారం

చిక్కడపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పురస్కారాలు ప్రోత్సాహాన్నిస్తాయని హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ శేషశయనారెడ్డి అన్నారు. ఆరాధన సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం త్యాగరాయగానసభలో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి న్యూస్‌ఛానల్ న్యూస్ ప్రజెంటర్ యామినికి ప్రతిభాపురస్కారం 2024 ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ జడ్జి బూర్గుల మధుసూదన్, వీరబోగవసంత రాయలు, కనకదుర్గ, చిల్లా రాజశేఖర్‌రెడ్డి, హనుమంతరావు, చరణ్, లోకం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు తొలుపునూరి కృష్ణగౌడ్, నాగభూషణం తదితరులు

సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం అభినందనీయం

రాంనగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన వర్గాల ప్రజలకు విద్యను అందించేందుకు కృషి చేసిన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం అభినందనీయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి సన్మానించారు.

11న వడ్డె ఓబన్న జయంతి

రాంనగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : వడ్డె ఓబన్న జయంతిని ఈనెల 11న అధికారికంగా నిర్వహిస్తాస్తున్నట్లు వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల వెంకటేష్ తెలిపారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వడ్డెర సంఘం చారిటి ట్రస్ట్, వడ్డె ఓబన్న జయంతి ఉత్సవాల సన్నాహక సమావేశం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి ఆయిలు మల్లు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11న వడ్డె ఓబన్న జయంతిని రవీంద్రభారతిలో నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు పిట్ల మల్లేష్, ప్రధానకార్యదర్శి ఎత్తూరి గణేష్, ఉపాధ్యక్షుడు శివరాత్రి భిక్షం, పల్లపు దుర్గయ్య, కార్యదర్శి గుర్రం శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ ఈఓ బాధ్యతల స్వీకరణ

చిక్కడపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లిలోని ప్రసిద్ధ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం నూతన కార్యనిర్వహణాధికారిగా ఎస్.అన్నపూర్ణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఈవోగా ఉన్న రామాంజనేయులు ఆమెకు బాధ్యతలు అప్పగించారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి దేవాలయం ఈఓగా పనిచేసిన అన్నపూర్ణ అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతిపై బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం ఈవోగా పనిచేశారు. అనంతరం ఏలూరు నాచారం శ్రీనరసింహస్వామి దేవాలయం ఈవోగా పనిచేసిన ఆమె చిక్కడపల్లికి బదిలీపై వచ్చారు. ఆమెను దేవాలయ అర్చక, ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు సన్మానించారు.

'సుదర్శనం హన్మాండ్లు' పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సమైక్య సాహితీ కరీంనగర్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి త్యాగరాయ గానసభలో సుదర్శనం హన్మాండ్లు స్మారక సాహితీ పురస్కారం ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త నందిని సిధారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ అక్షరంతో సమాజాన్ని మేల్కొలిపేలా రచనలు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన పలువురు ప్రముఖులకు పురస్కారాలను ప్రదానం చేశారు. నాళేశ్వరం శంకరం, తంగిరాల చక్రవర్తి, గజవెల్లి దశరథరామయ్య, రఘువీర్‌ప్రతాప్, గోపాల్, శ్యామ్‌ప్రసాద్, శ్రీరాములు, సంపత్, సుదర్శనాచారి, రాజమణి, అనంతాచార్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

సివరేజీ సమస్యలు లేకుండా చర్యలు : కార్పొరేటర్

చిక్కడపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో సివరేజీ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ పేర్కొన్నారు. డివిజన్‌లోని జవహర్‌నగర్, బాలాజీ రామ్‌సుఖ్ స్వీట్‌హౌస్ సమీపంలో ఇటీవల మొదలైన నూతన సివరేజీ పైప్‌లైన్ పనులను శనివారం ఆమె వాటర్ వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్, శంకర్‌తో కలిసి పర్యవేక్షించారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శనల కోసం దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): శ్రీవాగ్దేవి సంస్కృతి భారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాసర సరస్వతి స్తూప, సహిత కోటి పార్థివ లింగ స్థూపం ద్వాదశ జ్యోతిర్లింగ మందిరం మాసోత్సవం సందర్భంగా నృత్యప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ఈనెల 19న భరతనాట్యం, కూచిపూడి నృత్యప్రదర్శనలు నిర్వహిస్తున్నామని ఆసక్తిగల నృత్యకళాకారులు, నాట్యగురువులు 9948332032 నెంబర్‌లో ఈనెల 10వ తేదీలోపు సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

13న పదో తరగతి విద్యార్థులకు స్కాలర్‌షిప్ టెస్ట్

రాంనగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జఠాధార ఎడ్యుకేషన్ టెక్నాలజీ సంస్థ పదో తరగతి విద్యార్థులకు సూపర్ 100 స్కాలర్‌షిప్ అందించాలని నిర్ణయించినట్లు ఆ సంస్థ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ అరుణ్‌కుమార్ తెలిపారు. ఇందు కోసం ఫిబ్రవరి 16వ తేదీన ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్టులో అర్హత సాధించిన వారికి ఏప్రిల్ 13వ తేదీన లిఖిత పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఎంపికైన 100 మంది విద్యార్థులు ఉచితంగా ఐఐటీ, జేఈఈ, ఎన్ఈఈటీ నెట్ ఆన్‌లైన్ కోచింగ్, ఇంటర్ పూర్తయ్యే వారికి ప్రతినెలా 500 స్కాలర్‌షిప్ ఇస్తామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు రిజిస్ట్రేషన్ కోసం ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు రూ.200, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రూ.100 చెల్లించి, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జెఇటీసీఎస్.డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7337285228 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.


ముషీరాబాద్ డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణిని సన్మానిస్తున్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు

ప్రభుత్వ పాఠశాల భవనాన్ని పూర్తిచేస్తాం : ఎంపీ

ముషీరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తామని ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఎంపీ అనిల్‌కు ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణ సమస్యను వెల్లడించారు. స్పందించిన ఆయన మాట్లాడుతూ.. పాఠశాల భవన నిర్మాణం వెంటనే పూర్తి చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. నంతరం ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్, స్కూల్ హెచ్ఎం స్వరూపారాణిని అనిల్‌కుమార్ యాదవ్ సన్మానించారు. యూత్‌కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి అరవింద్‌కుమార్ యాదవ్, ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్‌యాదవ్, నియోజకవర్గం బీ-బ్లాక్ కమిటీ ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణంగౌడ్, కాంగ్రెస్ ముషీరాబాద్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు సంగపాక వెంకట్, పార్టీ రాష్ట్ర నాయకుడు వెంకటేష్, మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.